## క్లుప్తంగా

### ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆదిశంకరాచార్యుల విగ్రహంతో ర్యాలీ నిర్వహిస్తున్న భీమేశ్వరాలయ అర్చకులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతి పురస్కరించుకుని శంకర జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేద ఆశీర్వచన మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి విగ్రహంతో నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### భారతీయ సంస్కృతికి ప్రతీక సర్వారాయ ట్రస్టు



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న నిర్వాహకులు, అతిథులు

కపిలేశ్వరపురం: భారతీయ సంస్కృతికి ప్రతీకగా కపిలేశ్వరపురంలోని సర్వారాయ ఎడ్యుకేషనల్ ట్రస్టు నిలుస్తోందని కపిలేశ్వరపురం జమీందారు బలుసు బుచ్చి సర్వారాయుడు జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక సర్వారాయ హరికథా పాఠశాలలో శుక్రవారం ఎడ్యుకేషనల్ ట్రస్టీ డాక్టర్ ఎస్‌బీపీపీ రామ్మోహన్ పర్యవేక్షణలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేదపాఠశాల ప్రిన్సిపాల్ తంగిరాల దత్తాత్రేయశర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బుచ్చి సర్వారాయుడు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. హరికథా పాఠశాల ప్రిన్సిపాల్ అంగర సింగరాచార్యుల పర్యవేక్షణలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్ ఎస్.మూర్తి, కమ్మ వీరవెంకట్రావు పాల్గొన్నారు.

### ఈశ్వరమ్మ వారోత్సవాలు

రామచంద్రపురం రూరల్: పుట్టపర్తి సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ద్రాక్షారామ సత్యసాయి మందిరం వద్ద రేపు ఆదివారం ఈశ్వరమ్మ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు విద్యా విభాగం కోఆర్డినేటర్ విస్సాప్రగడ కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగర సంకీర్తన, ప్రశాంతి పతాక ఆవిష్కరణ, బాల వికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆదివారం ఉదయం హాజరు కావాలని కోరారు.

### ప్రజల ఒత్తిడితో ప్రభుత్వం దిగివచ్చింది

కపిలేశ్వరపురం (మండపేట): కులగణన చేపట్టాలన్న ప్రజా ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. తమ పార్టీ నాయకుడు, పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పదే పదే చేసిన ఒత్తిడితో నరేంద్రమోదీ ప్రభుత్వం కులగణనకు ముందుకు వస్తుందన్నారు. త్వరలో నిర్వహించనున్న పలు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కులగణన ప్రకటన చేసి ఉండొచ్చన్న అనుమానం ఉందని, అందుకే కులగణన ఎప్పుడు ప్రారంభించి ఎప్పటిలోపు పూర్తి చేస్తారో స్పష్టం చేయాలని కామన డిమాండ్ చేశారు.

### మోదీ సభకు తరలివెళ్లిన నియోజకవర్గ వాసులు

కపిలేశ్వరపురం: మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి అమరావతిలో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు ప్రజలు తరలివెళ్లారు. రాజధాని పునః ప్రారంభం పేరుతో శుక్రవారం నిర్వహించిన సభకు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, నేలటూరు, మండపేట పట్టణం, ద్వారపూడి, ఏడిద, తదితర గ్రామాల నుంచి మోదీ సభకు తరలివెళ్లారు.

### భవన నిర్మాణ అనుమతులకు హెల్ప్ డెస్క్

అమలాపురం టౌన్: ప్రజలు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే భవన నిర్మాణ అనుమతులను త్వరగా పొందేందుకు అవకాశం ఉంటుందని అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త విధానం, జీవో, మార్గ దర్శకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం, మున్సిపాలిటీ నుంచి లైసెన్స్ పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్లు, సర్వేయర్లు, ఇంజినీర్ల ద్వారా గ్రామ కంఠం, అధికార లే అవుట్స్, సర్క్యులేషన్ ప్యాటర్న్ మొదలైన ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులు పొందాలని కమిషనర్ రాజు సూచించారు.

# గాలి వీస్తే.. అంధకారమే

- నిర్లక్ష్యం నీడన విద్యుత్ లైన్లు
- వేలాడుతున్న 11 కేవీ వైర్లు
- ఒరిగిపోతున్న స్తంభాలు
- పట్టించుకోని ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది

కాజులూరు: మానవ జీవతంలో విద్యుత్ నేడు నిత్యావసరం. భారీ పరిశ్రమల నుంచి వంటింట్లోని గృహోపకరణాలు సైతం విద్యుత్ లేకపోతే కదలాడే పరిస్థితి లేదు. మానవాళికి ఇంతగా ఉపయోగపడే విద్యుత్‌ను వినియోగిచడంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలూ అంతే ఉన్నాయి. ప్రమాదాల నివారణకు విద్యుత్ సరఫరా చేసే ఆ శాఖ సిబ్బంది వినియోగదారులకు తగు జాగ్రత్తలు సూచించాల్సి ఉంది. అయితే సరఫరాలో ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది తీరు మాత్రం ప్రమాదాలు జరిగితే ప్రజలకే గాని మాకేంటి నష్టం అన్నరీతిలో ఉంది. ఇందుకు కాజులూరు మండల గ్రామాల్లో నిర్లక్ష్యంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీజు బోర్డులు, వేలాడే విద్యుత్ వైర్లు, ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు నిదర్శనంగా ఉన్నాయి. గ్రామాల్లో మీటర్ల సంఖ్యను బట్టి కరెంటు హెచ్చు తగ్గులను సరిచేసేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణంలో వారు తీసుకుంటున్న అనాలోచిత చర్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రధాన రహదారుల ప్రక్కన, చిన్నారులు పాఠశాలలకు వెళ్లేదారుల్లోనూ పెట్టడమే కాకుండా భూమి నుంచి రెండు లేక నాలుగు అడుగుల ఎత్తులో ఫ్యూజు బోర్డులను ఏర్పాటు చేసి వాటికి రక్షణ చర్యలు తీసుకోక పోవడంతో అవి ప్రమాద కేంద్రాలుగా మారి భయానకంగా కనిపిస్తున్నాయి. పలుచోట్ల 11 కేవీ విద్యుత్ వైర్లు మనిషి చేయిపైకి ఎత్తితే అందే ఎత్తులో కిందికి వేలాడుతున్నా..! సిబ్బంది వాటిని సరిచేసే ప్రయత్నాలు చేయడం లేదు. మండలంలోని గొల్లపాలెం కోళ్లతూము సెంటరులోనూ, పల్లిపాలెం రహదారిలోనూ, పెనుమళ్ళలో తలాటం నానాజీ పొలంలోనూ ఇలా అనేక చోట్ల విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదభరితంగా ఉన్నాయి. గొల్లపాలెం చీకట్లవారిపేటకు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభం పొలంలోకి వరిగిపోగా, మొగలిపాలెం వంతెన నుంచి దేగలపేటకు వెళ్లే రహదారిలో కూరాడ డ్రెయిన్ గట్టుపై ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం డ్రెయిన్‌లోకి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. అదే విధంగా కోలంకలోని యానం, ద్వారపూడి రహదారిలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ చెట్టుకొమ్మలను తాకుతుండగా గొల్లపాలెంలోని కాకినాడ, కోటిపల్లి రోడ్‌లో విద్యుత్‌స్తంభాల మీదుగా పాదులు వైర్లను చుట్టుకున్నాయి. దీంతో కొద్దిపాటి గాలివేసినా వైర్లు ఒక దానికొకటి తగులుకుని ఫ్యూజులు తెగుతున్నాయని గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ట్రాన్స్‌కో సిబ్బందికి భారీగా బిల్లులు వసూళ్లయ్యే ఇండ్రస్ట్రియల్ ఫీడర్‌పై ఉన్న శ్రద్ధ 11 కేవీ గృహవాసాల లైన్లపై ఉండటం లేదని వినియోగదారులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. 1996 నవంబర్‌లో సంభవించిన భారీ పెనుతుపాను సమయంలో మండల గ్రామాల్లోని విద్యుత్ వైర్లు తెగిపోయాయి. వైర్లు అతుకులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే అప్పటి నుంచి విద్యుత్ లైన్ల పునర్నిర్మాణం జరగకపోవటంతో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని కొద్దిపాటి గాలులకే గ్రామాలు అంధకారంలోకి పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే విద్యుత్ కోతలతో సతమతమవుతుంటే ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ లైన్లు తరచూ ట్రిప్ అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లతో తాము మరింత ఇబ్బందులకు గురవుతున్నామని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దేగలపేట రోడ్డులో కూరాడ డ్రెయిన్‌లోకి ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభం



గొల్లపాలెంలోని కాకినాడ-కోటిపల్లి రోడ్‌లో 11 కేవీ విద్యుత్‌స్తంభాల మీదుగా వైర్లను అల్లుకున్న పాదులు

### ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవటం లేదు



ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ వైర్లపై ఫిర్యాదులు చేస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. పైగా వాటి వద్దకు వెళ్లవద్దని ఉచిత సలహాలు ఇస్తున్నారు.

– వీరవల్లి గణపతి, రైతు, పెనుమళ్ళ

### విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలను నిలబెట్టి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలి. రానున్నది వర్షాకాలం కావటంతో స్తంభాలు పడిపోయినా, ఈదురు గాలులకు వైర్లు కలసిపోయినా కరెంటు ట్రిప్ అయి గృహోపకరణాలు చెడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– కురవాడ కొండబాబు, వినియోగదారుడు, దుగ్గుదుర్రు

# అకాల వర్షం..



తామరపల్లిలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు

కె.గంగవరం: అకాల వర్షంతో రైతులు ఉరుకులు పరుగులు తీశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వర్షం నుంచి తప్పించడానికి నానాపాట్లు పడ్డారు. మండల వ్యాప్తంగా శుక్రవారం కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లోని ధాన్యం తడిచిపోయింది. తామరపల్లి, యర్రపోతవరం, బాలాంత్రం, మసకపల్లి, కుడుపూరు పాణింగపల్లి, కుందూరు, రాయిచెరువు, కె.గంగవరం, అద్దంపల్లి, భట్లపాలిక గ్రామాల్లో వర్షం పడడం వల్ల ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఉరుకులు పరుగుల మీద పొలాలకు వెళ్లి ధాన్యం రాశులపై బరకాలను కప్పి రక్షించుకున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంలో వర్షం పడడం రైతులు కొంత వరకు నష్టపోయారు. మరో రెండు వారాల పాటు వాతావరణం అనుకూలిస్తే ఆరుగాలం శ్రమించిన పంట చేతికందుతుందని రైతులు ఆలోచిస్తున్నారు. కానీ వాతావరణం అనుకూలించకపోవడం వల్ల వారు ఆందోళన చెందుతున్నారు.



కె.గంగవరంలో తడిసిపోతున్న ఆరబెట్టిన ధాన్యం

## బీసీలు లక్ష్యంగా అణచివేతకు దిగితే సహించం

కపిలేశ్వరపురం: వల్లూరులో బీసీలే లక్ష్యంగా అణచివేతకు దిగితే సహించేది లేదని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. వల్లూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని చెరువుగట్టును ఆనుకొని ఉన్న నిరుపేద నివాసితులను కొందరు పంతం పట్టి ఖాళీ చేయించే రాజకీయాలను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇటీవల చెరువు గట్టును ఆనుకొని 40 ఏళ్లుగా నివాసముంటున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన 23 కుటుంబాల వారి ఇళ్లను ఆక్రమణల పేరుతో ఖాళీ చేయించారన్నారు. మండలంలోని కొన్ని చోట్ల చెరువు పరిధిలోని స్థలంలో నిర్మించిన సామాజిక భవనాలను ప్రభుత్వ ప్రజాప్రతినిధులే ప్రారంభించారన్న సంగతి గుర్తించాలని ఎద్దేవా చేశారు. ప్రత్యామ్నాయం చూపిన తర్వాత ఖాళీ చేయించాలన్న సామాజిక బాధ్యతను విస్మరిస్తే ఉద్యమిస్తామని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆయనతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీసీ సామాజికవర్గ నాయకులు మాట్లాడారు.



వల్లూరులో ఇళ్ల తొలగింపుపై మాట్లాడుతున్న గూడూరి

# త్రుటిలో తప్పిన ప్రమాదం

వరికోత మెషీన్ బోల్తా

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో శుక్రవారం వరికోత మెషీన్ బోల్తా పడింది. అయితే ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ ముందుగానే కిందికి దూకివేయడంతో త్రుటిలో ప్రమాదం తప్పి ప్రాణాలు కాపాడుకోగలిగాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. మండల గ్రామాల్లో దాళ్వా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్థానికంగా ఉన్న వరి కోత మెషీన్లు సరిపోకపోవడంతో రైతులు కొందరు ఇతర ప్రాంతాల నుంచి వరికోత మెషీన్లు రప్పించి పంట మాసూళ్లు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.సాయి తన వరికోత మెషీన్‌ను ఆర్యావటం తీసుకువచ్చారు. ట్రాలీపై నుంచి కిందికి దించుతుండగా వరికోత మెషీన్ అదుపుతప్పి బోల్తా పడింది. మెషీన్‌పై ఉన్న డ్రైవరు గమనించి కిందికి దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాగా ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గొల్లపాలెం పోలీసులు తెలిపారు.



ఆర్యావటంలో బోల్తా పడిన వరికోత మెషీన్

### కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కలెక్టరేట్ వద్ద సమ్మెలో భాగంగా ఐదవరోజు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి. మమత జ్యోతి, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఏ. సాయిశంకర్, జిల్లా కార్యదర్శి,కె. సాయి తేజలు ఆధ్వర్యంలో పలు మండలాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఆందోళనలో భాగంగా మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు.

## వ్యాధులపై అవగాహన కల్పించాలి

కపిలేశ్వరపురం: దోమల ప్రభావిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియాధికారి ఎస్.వెంకటేశ్వరరావు వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. వాకతిప్ప పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ల్యాబ్ టెస్టులు, మందులు అందజేత తదితర అంశాలను వైద్యాధికారి చిట్టూరి రాకేష్ కృష్ణచౌదరిని ఆరా తీశారు. సిబ్బంది విధుల నిర్వహణ, మందుల లభ్యతకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మలేరియాపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి సత్యనారాయణ, ఎంపీహెచ్ఎస్ వీఎస్ కామేశ్వరరావు, పీడీడీ బిషప్, ఎల్‌టీ నాగబాబు దొర పాల్గొన్నారు.

దంగేరులో..

కె.గంగవరం: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దంగేరు పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాబ్ రికార్డులు, ఆసుపత్రి రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది పలు సూచనలు చేశారు. జర్వాల సర్వే వివరాలను పీహెచ్‌సీ వైద్యులు లక్ష్మి ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం డెంగీ, మలేరియా జాగ్రత్తలతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ మూర్తి, ఎంపీహెచ్ఎస్ఎఫ్ మంగాదేవి, వైద్య సిబ్బంది వివేక్, మహేష్, ఏఎన్‌యం జ్యోతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



వాకతిప్పలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మలేరియా అధికారి

## యు-విన్ వ్యాక్సినేషన్‌పై ఏఎన్‌ఎంలకు శిక్షణ

రాయవరం: మండలంలోని మాచవరం పీహెచ్‌సీలో యు-విన్ వ్యాక్సినేషన్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారి మణికంఠ ఆధ్వర్యంలో రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలోని ఏఎన్‌ఎంలు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి వచ్చిన వ్యాక్సినేషన్ మేనేజరు సునీల్ ఏఎన్‌ఎంలకు శిక్షణనిచ్చారు. మీజిల్ వ్యాక్సినేషన్, డీపీటీ వ్యాక్సినేషన్, టీటీ వ్యాక్సినేషన్‌పై డ్యూలిస్ట్ ఎలా క్లియర్ చేయాలి. కొత్తగా వ్యాక్సినేషన్ సైట్స్ ఎలా క్రియేట్ చేయాలి. తదితర విషయాలపై ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈవో తులసీదాస్, సూపర్‌వైజర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాచవరం పీహెచ్‌సీలో యు-విన్ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న సునీల్

## పట్టణ స్వాగత ద్వారాన్ని ఆధునీకరించరా!

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి స్వాగతం పలుకుతూ గుమ్మిలేరు రోడ్డులోని బైపాస్ వద్ద గతంలో నిర్మించిన స్వాగత ద్వారం ఆధునీకరణకు నోచుకోవడం లేదు. రాష్ట్ర రాజధాని విజయవాడ నుంచి విశాఖపట్టణం, కాకినాడ వెళ్లే బస్సులు, కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం, ఆలమూరు మీదుగా వచ్చే వారు ఈ స్వాగత ద్వారం మీదుగా పట్టణంలోకి ప్రవేశిస్తారు. స్వాగతద్వారం ఆకర్షణీయంగా ఉండటాన్ని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. బేస్‌మెంట్ నిర్మించిన సమయంలో ద్వారం నిర్మాణం పూర్తయింది. కానీ ఆకర్షణీయత కోసం చేపట్టాల్సిన పనులు నిలిచిపోయాయి. మున్సిపల్ అధికారులు స్పందించి ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కళావిహీనంగా మండపేట పట్టణ స్వాగతద్వారం

## తాగునీరు అందించకపోతే మరణమే శరణ్యం



సన్నవిల్లిలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: నిత్యావసరాలలో ప్రధానమైన తాగునీరు అందించటంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని, తాగునీరు అందించకుంటే మరణమే శరణ్యమని సన్నవిల్లి గ్రామస్తులు ఆవేదన చెందారు. మండలంలోని సన్నవిల్లి గ్రామ పంచాయతీ పరిధి పెదచెరువు గట్టు దళిత ప్రాంతంలో గత వారం రోజులుగా తాగునీటి సౌకర్యానికి అంతరాయం ఏర్పడటంతో శుక్రవారం గ్రామస్తులంతా ఖాళీ బిందెలతో నిరసన చేపట్టి, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు మంచి జరుగుతుందన్న మాయలో పడి ప్రజలు గెలిపిస్తే కనీసం తాగునీరు అందిచడంలో సైతం ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వారం రోజులుగా మంచినీరు లేక గొంతెండిపోతుంటే ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్య వైఖరి చూపిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందిచి ఆ ప్రాంతానికి రెండు పూటలా ట్యాంకర్లతో తాగునీటిని సప్‌లై చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు పోలినాటి వెంకటేశ్వరావు, కె.సత్యసుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.త్రిమూర్తులు, తాళ్ల భీమేశ్వరరావు, కాశీ మంగాయమ్మ, పోలినాటి మంగాయమ్మ, గోడి లావణ్య తాళ్ల దుర్గాభవాని ఉన్నారు.

## మసీదు స్థలం ఆక్రమణపై సర్వే



వెదురుమూడిలో సర్వేపై మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నారావు

కపిలేశ్వరపురం: వెదురుమూడిలోని మసీదు స్థలం ఆక్రమణకు గురైందంటూ గ్రామానికి చెందిన షేక్ హైదర్ ఈ ఏడాది ఏప్రిల్ 21న పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. మసీదు స్థలంలో గోడ నిర్మించారంటూ అర్జీలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై శుక్రవారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలోని అధికారుల బృందం సర్వే చేశారు. మసీదు నిర్వహణకు సంబంధించిన రికార్డులు, సరిహద్దు స్థలం గల ఉప్పర్ల శేఖర్‌కు చెందిన స్థలం రికార్డులను పరిశీలించారు. సర్వేయర్‌తో సరిహద్దులను నిర్ణయించి మక్కులు పాతారు. సర్వే పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. సర్వేలో ఈఓపీఆర్‌డీ ఆర్‌వీవీఎస్ ఈశ్వరావు, పంచాయతీ సచివాలయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించాలి



పసలపూడిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న స్వరూప్

రాయవరం: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించేందుకు కృషి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఐ.స్వరూప్ ఏపీవో సుధారాణికి సూచించారు. మండలంలోని పసలపూడి, నదురుబాద గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనుల మస్టర్‌ను తనిఖీ చేసి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీడీవో స్వరూప్ మాట్లాడుతూ పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించడం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఉపాధి హామీ పనుల్లో ప్రతి రోజు మస్టర్ వెరిఫికేషన్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కార్యక్రమ అధికారి ఎం.నాగలక్ష్మి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## 12న మాలల మహారణభేరిని విజయవంతం చేయండి

రామచంద్రపురం రూరల్: ఈ నెల 12న జరగబోయే మాలల మహా రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ద్రాక్షారామ మార్కెట్ యార్డ్‌లో మాలల ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మాల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పండు అశోక్ కుమార్, మాల సంఘాల జేఏసీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బీఎస్‌పీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం, జేఏసీ కాకినాడ అధ్యక్షుడు బుంగ సతీష్ కుమార్ హాజరు కాగా అంబేద్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు నాయకుడు జల్లి శ్రీను, నాతి శ్రీను పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ఈ నెల 12న కాకినాడ మెక్లర్ ఇన్ గ్రౌండ్‌లో మాలల మహా రణభేరిని నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల నుంచి జన సమీకరణ చేసి భారీ సంఖ్యలో మాల సోదరులను భాగస్వాములు చేయాలని నిర్ణయించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి ముఖ్య నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు.


## సోమాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సోమాలమ్మ

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో వేంచేసి ఉన్న సోమాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శైవాగమ అర్చకులు భైరవభట్ల వెంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు చేసి, సోమాలమ్మను అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి నైవేద్యాలు చెల్లించారు. అనంతరం నాగులపల్లి పాపవ్యరాజు సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. జాతర ఉత్సవాలు మరో నాలుగు రోజులపాటు జరుగుతాయని కమిటీ సభ్యులు వెల్లడించారు.

## వైభవంగా రామానుజాచార్యులు జయంతి



రామానుజాచార్యులు చిత్రపటానికి పూజలు చేస్తున్న సంఘ సభ్యులు

అమలాపురం టౌన్: అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వాసవీ ఫంక్షన్ హాలులో భగవత్ రామానుజాచార్యుల తిరు నక్షత్రం (జయంతి) సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత రామానుజాచార్య స్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. వైశ్య సంఘం నాయకుడు, రామానుజదాసుడు వరదా సూరిబాబు మాట్లాడుతూ రామానుజాచార్యుల జీవిత చరిత్ర, మహిమల గురించి భక్తులకు వివరించారు.